పార్వతీపురంలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి

పివిటిజి నూరుశాతం నమోదు లక్ష్యం

ప్రజాశక్తి - పాచిపెంట

పిఎం జన్‌మాన్‌లో పివిటిజి (పర్టిక్యూలరీ వెనిరబుల్ ట్రైబల్ గ్రూప్) శత శాతం నమోదు లక్ష్యంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పిఎం జన్ మాన్ (పిఎంజెఎం) ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమం మండలంలోని పనుకువలసలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పివిటిజిలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం పిఎం జన్ మాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మిషన్ మోడ్‌లో మహా అభియాన్ కార్యక్రమం చేపడుతూ ప్రతి పివిటిజికి ప్రతి పథకం అందాలని నిర్ణయించిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉజ్జ్వలయోజన పథకం కింద నమోదు కావాలని, తద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ లభిస్తుందని తెలిపారు. ఏడాదికి 12 సిలిండర్లు 30 శాతం రాయితీపై లభిస్తుందన్నారు. జిల్లాలో గత కొద్ది రోజుల్లో 10 వేల మందికి మంజూరు చేశామని, 80 వేల మందికి ఇవ్వాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన వలన ప్రమాద బీమా లభిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పిఎం కిసాన్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, దీనదయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), పిఎం ఉజ్వల యోజన, పిఎం విశ్వకర్మ, పిఎం కిసాన్ సమాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పిఎం పోషన్ అభియాన్, హర్ ఘర్ జల్ - జల్ జీవన్ మిషన్, జన్‌ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, పిఎం ప్రణామ్, నానో ఎరువులు, సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్ వంటి గిరిజన ప్రాంతాలకు సంబంధించిన నిర్దిష్ట పథకాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర అంశాలను అమలు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి జన్‌జాతి ఆదివాసీ గ్రామంలో అవగాహన సదస్సులు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆయన అన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత మంచాల పారమ్మ మాట్లాడుతూ గిరిజనులకు ఐటిడిఎ ద్వారా గతంలో వలే రాయితీలు అందించాలని, గిరిజన సాంప్రదాయం కనుమరుగవుతున్న తరుణంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు చిరస్మరణీయం గా ఉండేందుకు మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. ఉజ్వల కార్యక్రమం కింద గ్యాస్ ఉచితంగా లభిస్తుందని ఆమె తెలిపారు. సర్పంచ్ సిహెచ్ సీతారామ కృష్ణ మాట్లాడుతూ 160 పోడు పట్టాలు అందించడం పట్ల అభినందించారు. స్మశాన వాటికలకు రహదారులు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారికి అనుసంధాన రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. గడబలను బోడో గదబలుగా గుర్తించాలని, జీడి పిక్కల పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు. పారమ్మ కొండకు ఇతర ప్రాంతాల నుండి యాత్రికులు వస్తున్నారని, సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ పిఎం జన్ మాన్, పిఎంఏవై, 4జి మొబైల్, అభిలాష (గ్రంధాలయాలు), జల జీవన్ మిషన్, శిశు మరణాలు నియంత్రణ, ఇన్నోవేటివ్ హబ్ తదితర అంశాలపై చాయా చిత్ర ప్రదర్శన ఏర్పాట చేశారు. పలువురు మహిళలకు పౌష్ఠిక ఆహారం అందించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, డిఆర్ఒ కె.హేమలత, ఎంపిపి బడ్నాన ప్రమీల, వైస్ ఎంపిపి ఎం.నారాయణ, డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ శివప్రసాద్, జిసిసి డిఎం మేనేజర్ వి.మహేంద్ర కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు, ఐటిడిఎ ఎపిఒ ఎం.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పట్టణానికి పండగ శోభ

కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణానికి పరిసర ప్రాంత గ్రామాలతో పాటు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సీతానగరం మండల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఎత్తున చేరుకోవడంతో శనివారం స్థానిక ఆర్‌టిసి కూడలి నుండి పాత బస్టాండ్ కూడలి వరకు ప్రధాన రహదారి రద్దీగా మారింది. వస్త్ర వ్యాపారానికి ముఖ్య కేంద్రమైన దేవాంగుల వీధి అమ్మకాలు కొనుగోళ్లతో కిటకిటలాడింది. దీంతో పట్టణంలో ఉన్న టిఫిన్ దుకాణాలు, భోజనం హెూటల్స్, రెస్టారెంట్లు, ఖాళీ లేకుండా కిటకిటలాడాయి.

బెలగాం శివారున గల సుందరయ్య భవనం సమీపంలో రహదారికి ఇరువైపులా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వస్త్ర వ్యాపారులు టెంట్లు వేసుకుని రెడీమేడ్ దుస్తులను అమ్మకాలు సాగించడంతో యువత వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించారు. పట్టణంలో ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాలలో ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు నానా అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోవడంతో వాహనదారులు ఎక్కడికక్కడే తమ వాహనాలను పార్కింగ్ చేస్తూ కొనుగోలుకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పలు రకాల వాణిజ్య దుకాణాలతో పాటు, రహదారిపై ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారస్తులు, తోపుడు బండ్ల వద్ద పట్టణ ప్రజలు, తమ పూర్వీకుల మొక్కు తీర్చుకునేందుకు అవసరమైన దుస్తులతో పాటు, రెడీమేడ్ వస్త్రాలు, చిన్నపిల్లల దుస్తులు, గాజులు, అలంకరణ వస్తువులు, పండగ చేసుకునేందుకు అవసరమైన పూజ సామాగ్రి, కాయగూరలు, నిత్యవసర సరుకులు, కొనుగోలు చేసుకునేందుకు ఉత్సాహం చూపించారు. ప్రజల అవసరాలను గుర్తించిన అన్ని రకాలైన వ్యాపారులు తాము అమ్మకాలు చేస్తున్న వస్తువులను అధిక ధరలకు విక్రయాలు చేస్తుండడంతో, చేసేదిలేక ప్రజలు కొనుగోలు చేయవలసిన పరిస్థితి వచ్చింది.

వీరఘట్టంలో కిక్కిరిసిన జనం

వీరఘట్టం : సంక్రాంతి పండగ నేపథ్యంలో వివిధ వస్తువుల కొనుగోలు చేసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వీరఘట్టానికి చేరుకోవడంతో ప్రజలతో రహదారి కిక్కిరిసిపోయింది. వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు, కాయగూర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సంక్రాంతి నేపథ్యంలో అన్ని రకాల కాయగూరలు కలిపి వంటకాలు చేయడం ఆనవాయితీ. ఇదే అదును చూసి కొంతమంది కూరగాయల వ్యాపారులు అమాంతంగా ధరలు పెంచేశారు. ధర అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తప్పదంటూ కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. నూనె, బెల్లం, పంచదార, మైదా, గోధుమపిండి ధరలు కూడా పెరిగాయి. వ్యాపారులంతా సిండికేట్‌గా మారడంతో ఏ షాప్‌నకు వెళ్లినా ఇవే ధరలు వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా పండగలో వ్యాపారులు ప్రజల నుంచి అధిక ధరలకు వస్తువులను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ధరలు అధికంగా ఉన్నప్పటికీ సరుకుల్లో నాణ్యత లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

బస్సులు కిటకిట

సంక్రాంతి నేపథ్యంలో ఎక్కడెక్కడో ఉంటూ స్వగ్రామాలకు చేరుకుంటున్న వారితో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. ఆదివారం నుంచి సంక్రాంతి కావడంతో శనివారం వేలాది మందితో ఆర్‌టిసి కాంప్లెక్సు కిక్కిరిసిపోయింది. బస్సులు ఎక్కడానికి ప్రయాణికులు పోటీ పడ్డారు. ప్రధానంగా వలసకూలీలు విశాఖ, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్, చెన్నైలో పనులు చేసుకుంటున్నారు. అలాగే ఉద్యోగాలు, చదువు రీత్యా ఆయా ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు వస్తుండడంతో బస్సులన్నీ కిటకిటలాడు తున్నాయి. ప్రయాణికులకు సరిపడా బస్సుల్లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

సంక్రాంతి పండుగ శుభ వేళ రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలు వెల్లివిరియాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి లోగిళ్ళు భోగ భాగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో నిండి, ప్రతీ ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరారు. పంటలు బాగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రైతాంగం కూడా ఎంతో సంతోషంగా ఉందని రాజన్నదొర పేర్కొన్నారు.

ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ప్రజలకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, శుభాలు, ప్రతి ఇంటా కాంతులు వెదజల్లాలని ఆకాక్షించారు.

పదవీ యావలు... ప్రజా సమస్యలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు పుట్టెడు సమస్యలతో ప్రజానీకం. మరోవైపు పదవులే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికార ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు. ఎన్నికల ముందైనా తమ సమస్యలు పరిష్కరించకపోతారా? అని ఆశ చూస్తున్న ఉద్యోగులకు నిరాశే ఎదురౌతోంది. ఉన్న హామీలు నెరవేర్చలేదు సరికదా అధికార పార్టీ నాయకులు కొత్తకొత్త హామీలతో ముందుకు వస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలుకు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదు? అని నిలదీయాల్సిన ప్రతిపక్ష పార్టీ నాయకులూ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు లేదా ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవుల హామీల కోసం అధినేతల వద్ద ఎగబాకుతున్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి స్కీమ్ వర్కర్లు, సర్వశిక్షాభియాన్‌లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇలా పలు రంగాలకు చెందిన వారంతా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాదాపు నెల రోజుల నుంచి ఆందోళన చేస్తునే ఉన్నారు. వీరితో చర్చిస్తున్న ప్రభుత్వం కంటితుడుపు హామీలు తప్ప, వారి జీవనంతో ముడిపడివున్న ఆర్థికపరమైన అంశాలను నెరవేర్చడం లేదు. మరోవైపు ధాన్యం రైతులు తాము నిలువ దోపిడీకి గురవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధులు కనిపించడం లేదు. ఎపి రైతు సంఘం నాయకులు మాత్రమే వారి తరపున అధికారులను కలిసి విన్నపాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వీరి సమస్యలను అవగతం చేసుకుని ప్రభుత్వానికి తెలియజేసి, సమస్యల పరిష్కారానికి అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేయడం లేదు. టిడిపికి చెందిన నాయకులు కేవలం ఆందోళన చేస్తున్న వారికి సంఘీ భావం తెలియజేడం తప్ప ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టి రోడ్లపైకి రావడం లేదు. వైసిపి నాయకులు ఓ అడుగు ముందుకేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని మరీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేసి వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. టిడిపి నాయకులు శిబిరాల వద్దకు వెళ్లి, వైసిపి చేయనివన్నీ తాము అధికారంలోకి వచ్చాక చేసేస్తామంటూ ఉచిత హామీలు గుప్పిస్తున్నారు. దీంతో, ఇటు టిడిపి నాయకులుగానీ, అటు వైసిపి నాయకులుగానీ పదవుల కోసం తప్ప ప్రజాసమస్యలపై పనిచేయడానికి రాజకీయాల్లోకి రాలేదని జనం చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులు, ముఖ్యంగా సిపిఎం, సిఐటియు నాయకులు మాత్రమే కార్మికులు, ఉద్యోగులు, ప్రజల తరపున నిఖరంగా ఉన్నారంటూ చర్చ జరుగుతోంది.

రైస్‌మిల్ యజమానిపై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతుల నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటున్న పాలకొండకు చెందిన శ్రీ సత్యనారాయణ మోడర్న్ రైస్ మిల్‌పై క్రిమినల్ కేసు శనివారం బుక్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం అలమండకు చెందిన డోల్లు సతీష్ తన ధాన్యాన్ని సత్యనారాయణ మోడర్న్ రైస్ మిల్‌కు రవాణా చేశారు. అయితే 62 కిలోలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన మొత్తాన్ని మిల్ యాజమాన్యం ఫోన్ పే ద్వారా చెల్లించాలని డిమాండ్ చేయడంతో సతీష్ తప్పనిసరి పరిస్థితిలో చెల్లించారు. ఇదిలా ఉండగా తన వద్ద ధాన్యం డిమాండ్ చేయడం, ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లింపులపై నేరుగా కలెక్టర్‌కు సతీష్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ నిశాంత్ కుమార్ తక్షణం స్పందించి క్రిమినల్ కేసు పెట్టాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం డి నాయక్ ను ఆదేశించగా పాలకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సతీష్‌కు ముందుగా అతను చెల్లించిన నగదును వెంటనే ఇప్పించారు.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందిస్తూ ఒక్క గింజ ధాన్యం అదనంగా తీసుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ హెచ్చరించినా ప్రవర్తన మార్చుకోకపోతే చట్ట రీత్యా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఒక్క గింజ ధాన్యం కూడా అదనంగా మిల్లర్లకు ఇవ్వరాదని ఆయన కోరారు. రైతులను దోపిడీ చేయుటకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నామని ఆయన అన్నారు. ఒక్క గింజ కూడా అదనంగా ఇవ్వవద్దని, ఎవరైనా అడిగితే వెంటనే ధాన్యం కొనుగోలు జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 08963-293037, 7702003582., జిల్లా కలెక్టర్ సిసి ఫోన్ నంబరు - 8333813243 కు వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

పార్వతీపురంలో భోగి మంటల్లో జీవో కాపీలను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీలపై సిఎం బూటకపు ప్రేమ

కొనసాగుతున్న కోటి సంతకాల సేకరణ • 33కు చేరిన నిరవధిక సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో అంగన్వాడీలపై ముఖ్యమంత్రి బూటకపు ప్రేమను కురిపించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తమను రోడ్డు ఎక్కించారని అంగన్వాడీ జిల్లా నాయకులు వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారానికి 33వ రోజు కొనసాగుతున్న నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు 33 అంకె ఆకృతిలో కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సామాజిక వర్గాల్లో, కార్మికుల్లో మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్న ప్రచారం ఒట్టి బూటకపు ప్రచారమని, ఆచరణలో శూన్యమని విమర్శించారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమనుకుంటే అంగన్వాడీలు కూడా మహిళలేనిని గమనించాలని గుర్తు చేశారు. కుటుంబాల సైతం తృణప్రాయంగా పెట్టి పోరాడుతున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వ మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. అంగన్వాడీ మహిళా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదని పెద్ద సమూహమని అన్నారు. సమ్మె ప్రారంభం నుండి ఇప్పటి వరకు అనేక దఫాలుగా ప్రభుత్వ అధికారులు చర్చలు చేపడుతున్నా, ఏ ఒక్క సమస్య పరిష్కారమయ్యే దిశగా లేవని, చర్చలకు ఆహ్వానించి బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడడం అమానుషమని వాపోయారు. అంగన్వాడీల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తుందని, మన ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సమ్మె డిమాండ్లు పరిష్కారానికి నిర్దిష్ట హామీని అందించాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేపడతామని హెచ్చరించారు. అనంతరం శనివారం రాత్రి భోగిమంటల్లో జిఒ కాపీ 2పత్రులను రద్దు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌరీమణి, ధర్మవతి, రాజేశ్వరి, శాంతి మరియు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పనుకువలస వద్ద కోటి సంతకాల సేకరణ ప్రాజెక్ట్ నాయకులు ఎం.బంగారమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బంగారమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని గుర్తించి చట్టపరంగా వారి హక్కులను కాపాడాలని, వేతనాలు పెంచాలని కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అంగనవాడీలపై చిన్నచూపు మానుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జట్ల వెంకట్రావు, ఎస్.సూర్యనారాయణ, ఐద్వా నాయకులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమ్మె 33వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణితో కక్ష సాధింపు విధానాలు అవలంభిస్తుందని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అంగన్వాడీలు ఇదే పట్టుదలతో భవిష్యత్తు ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు సిహెచ్.గౌరమ్మ, ఎం.సావిత్రి, కృష్ణవేణి, స్వాతి, పద్మావతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు మద్దతుగా గుమ్మలక్ష్మీపురంలో సిఐటియు నాయకులు కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, కోలక అవినాష్ మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 32 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం విచారకరం అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు కొనసాగుతాయని సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీలు సమ్మె ప్రారంభించి శనివారంతో 33 రోజులు అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మె శిబిరం దగ్గర ప్రధాన రహదారిపై 33వ అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ లీడర్లు ఎం.మీనాక్షి , డివి రత్నం, బి.జయలక్ష్మి, ఎస్.సులోచన, డి.జ్యోతిలక్ష్మి, ఎన్.సుమతి తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఎస్మా, షోకాజ్ నోటీసులు

సాలూరు :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 33రోజుకు చేరింది. శనివారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా, షోకాజ్ నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చర్చలకు పిలిచి బెదిరింపులకు దిగుతోందన్నారు. కవ్వింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ, సుభద్ర, సుజాత పాల్గొన్నారు.

సీతానగరం : 33వ రోజు కొనసాగిన అంగన్‌వాడీలు దీక్షా శిబిరం వద్ద పిండివంటలు తయారు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత ఇచ్చి తెలంగాణ కన్నా ఒక వెయ్యి అదనంగా జీతం పెంచుతామని హామీ ఇచ్చి నేడు అదే హామీల కోసం 33 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. అంగన్వాడీల ఆకలి బాధలు వినకుండా ఉన్నారని, వాటికి నేటి సమ్మె సంక్రాంతి పిండి వంటలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వెన్నెల రామలక్ష్మి మడక సత్యవతి, మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మరిచర్ల సునీత, పి.యశోద, ఆర్, లక్ష్మి తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు.

బలిజిపేట : మండల కేంద్రంలోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు చీరలతో ఉరి వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణితో కక్ష సాధింపు విధానాలు అవలంభిస్తుందన్నారు. చర్చలకు పిలిచి అంగన్వాడీలను అవమానపర్చి, బెదిరింపులకు దిగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిచో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు ఇందిర, స్వర్ణ, గౌరమ్మ, శారద, సావిత్రి, కష్ణవేణి, పద్మావతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: ఐటిడిఎ ఎదుట 33వ రోజు నిరవధిక సమ్మె సందర్భంగా గిరిజన జెఎసి నాయకులు రామస్వామి సమ్మె శిబిరం వద్ద హాజరైన అంగన్వాడీ ఉద్యోగులు మరింత సంఘటితమవుతున్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని తిప్పి కొట్టాలనారు. ప్రజల చేత ఎన్నుకోబడే ప్రభుత్వాలు నియంతలా ప్రవర్తంచరాదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల కాంతారావు, అంగన్‌వాడీలు ప్రియ, అరుణకుమారి, అంజలి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

బలిజిపేటలో చీరలతో ఉరేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ వద్ద 33వ అంకె ఆకృతిలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సీతానగరంలో : పిండివంటలు వండుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

మూలజమ్ము రోడ్డుపై గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిర్మించిన వారం రోజులకే మండలంలోని మూలజమ్ము రోడ్డు నాణ్యత లోపం వల్ల పాడైపోయి పెచ్చులు ఊడిపోవడంతో స్థానిక గిరిజనులు శనివారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. మూలజమ్ము గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించిన నేపథ్యంలో వారం రోజుల కిందట రోడ్డు నిర్మించారని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు నాణ్యత లేకపోవడంతో పూర్తిగా పాడైపోయి పెచ్చులు ఊడిపోతుందని ఆందోళన చెందారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం, నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా రోడ్డు నిర్మించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పాడైన రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

త్వరితగతిన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాలసిన పెండింగ్ బకాయిలైన పిఆర్‌సి, డిఎ, ఎపి జిఎల్‌ఐలను త్వరితగతిన చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్‌టియు, ఎస్‌టిటి ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.సుబ్బారాయుడు, కె.దేవియల్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిఎఫ్ లోన్స్ సరెండర్ లీవ్ ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాలో జమ అవుతుందని ఆనందపడుతున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి దుర్గారావు, రాష్ట్ర మీడియా కన్వీనర్ ఏ వెంకట్రావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్తవలసలో వికసిత్ భారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలసలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కె కె కుమార్ వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటి మీద ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

'హెల్పింగ్ హ్యాండ్స్' ఇంటి నిర్మాణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి కీర్తిశేషులు రవి మాస్టారు కుటుంబానికి ఇల్లును నిర్మించారు. కిల్లక రవి మాస్టారు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడేందుకు గుమ్మలక్ష్మీపురం గ్రామ సర్పంచ్ గౌరీ శంకర్రావు, హెల్పింగ్ హాండ్స్ యువకులు కలిసి ఇల్లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సుమారు రూ.1.30 లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని సమకూర్చి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం స్లాబ్ వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్రావుతో పాటు వైశ్య సంఘం అధ్యక్షులు హరిప్రసాద్, సామాజిక కార్యకర్త ఎర్నాకుల నాగరాజ్, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పాశ్రీవాణి

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మంతిని వలసలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాకులు పద్మ (35), ప్రదీప్ నగర్ కాలనీకి చెందిన దాసరి మహాలక్ష్మి (60) కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆమె మాట్లాడుతూ అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, నాయకులు షేక్ నూరేళ్ల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ఆలయ అర్చకులు వివి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అలాగే శనివారం దళాయవలస నుంచి గుల్లిపల్లి శ్రీనివాస నాయుడు అధ్వర్యంలో సుమారు 100 మంది భక్త బందం కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి వివి సూర్యనారాయణ అన్ని ఏర్పాట్లు చేసియన్నారు. అలాగే భోగి పండగ నేపథ్యంలో గోదాదేవి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామని, కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, సభ్యులు గౌరీశంకర్‌పాత్రో, కుసుమూరు సాగర్, గంటేడ సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని పెద్ద బుడ్డిడి, గజబవలస గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ శీమల సుజాత తెలిపారు. గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ చేశామన్నారు. వీధి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించినట్లు ఆమె తెలిపారు. ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శీమల బాబు భువనమోహన్ రావు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సుజాత

ఏజెన్సీలో చలి పులి

ప్రజాశక్తి - సీతంపేట

మన్యంలో చలి రోజురోజుకు పెరిగిపోతుంది. ఉష్ణోగ్రతలు రాను రాను తగ్గిపోవడంతో ఎముకలు కొరికేసేన చలి పెరగడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, పెద్దలు సైతం చలిని భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో దట్టమైన కొండలు, చెట్లు ఉండడంతో మన్యంలో మంచు దుప్పటి అల్లుకుపోయింది. దీంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలి ప్రారంభమవుతుంది. ఉదయం 8గంటల వరకు సూర్యుడు కనిపించకపోవడంతో విద్యార్థులు పనులు చేసుకునేవారు దూరంగా వెళ్లేవారు సమయానికి చేరుకోలేకపోతున్నారు. చలికి బయటకు రాకపోవడం, మరో పక్క పొగ మంచు దట్టంగా ఉండడంతో రోడ్డు కనిపించడం. దీంతో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. మరోపక్క ఏజెన్సీలో ఉన్న వారు నూలు వస్త్రాలు మఫ్లర్, రగ్గులు దుప్పట్లు, చలి కోట్లు స్వెటర్లు ధరించాలని, చేతులకు గ్లౌజులు, కాళ్లకు షాక్సులు తప్పనిసరిగా వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు వైద్యులు కూడా వేడి నీళ్ల తాగడం వేడి పదార్థాలు తినడం వేడి నీళ్ల స్నానం చేయడం వంటివి సూచనలు ఇస్తున్నారు. వైద్యులను సంప్రదించి సలహాలు తీసుకోవాలి.

చిన్నారులకు, వృద్ధులకు తప్పని తిప్పలు

దట్టంగా కురుస్తున్న మంచు

కలప స్మగ్లర్లకు అడ్డుగా ఏజెన్సీ

ప్రజాశక్తి - సీతంపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ అంటూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, సంరక్షించాలని, దీనివల్ల సకాలంలో వర్షాలతో పాటు వాతావరణం స్థితిగతులు సమానంగా ఉంటాయని చెప్తున్నారు. ఏజెన్సీలో ఇందుకు భిన్నంగా మారింది. సీతంపేట ఏజెన్సీలో కలప స్మగ్లరుకు అడ్డగా మారింది. యథేచ్ఛగా ట్రాక్టర్లతోను, పికప్ వాహనాలతో అక్రమ కలప రవాణా చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో అధికంగా టేకు, వనస, ఏగిస, గుగ్గిలం, మామిడి తదితర కలప పుత్తికవలస, మర్రిపాడు, చిన్నబగ్గ, దోనుబాయి, కడగండి, శంభాం తదితర ప్రాంతాల నుంచి కలప అక్రమంగా తరలిపోతుంది. ఇక వర్షాకాలంలో కలప స్మగ్లర్లకు అనువుగా మారుతుంది. ఎందుకంటే ఆ సమయంలో అటవీ శాఖాధికారులెవరూ తిరగకపోవడంతో వాహనాల ద్వారా కలప మిల్లులకు తరలిపోతుంది. ఇక సంక్రాంతి సమయంలో అందరూ పండగ సీజన్లో తల మునకలై ఉంటే అక్రమార్కులు ఇదే అదునుగా కలప రవాణా చేయడానికి సిద్ధమవుతున్నారు. దీనిపై ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు వద్ద ప్రస్తావించగా, బేస్ క్యాంపులో పగడ్బందీగా నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం బిల్లులతో ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సమాధానం ఇచ్చారు.

తరలింపునకు సిద్ధంగా ఉంచిన కలప

'పల్లె పిలుస్తోంది రా' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రం బాగు కోసం ప్రతి ఒక్కరికీ చంద్రబాబు పాలన ఆవశ్యకత, అవసరం గురించి గ్రామాలలో ప్రజలకు వివరించడమే పల్లె పిలుస్తోంది రా కార్యక్రమం ఉద్దేశం అని మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం ఈ మేరకు తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిరీత్యా ఎక్కడెక్కడో ఉంటూ సంక్రాంతి పండగకి పల్లెకు చేరుకున్న ప్రతి ఒక్కరికి రాష్ట్రం బాగుపడాలంటే మళ్ళీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని చెప్పడం, ఓట్లు ఉన్నాయో లేవో చూసుకోవడం సంక్రాతి పండగకి బయట నుండి వచ్చిన ప్రతి ఒక్కరిని కలిసి తప్పకుండ ఎలక్షన్‌కు ఓటుహక్కు వినియోగించుకోవాలని చెప్పడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలా వెంకట్రావు, గుంట్రెడ్డి రవికుమార్, రవికుమార్, బంకపల్లి రవి, హనుమంత్ శంకర్, బంకపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురం : పల్లె పిలుస్తోంది రా గోడ పత్రికను కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి శనివారం గుమ్మలక్ష్మీపురంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తిరీత్యా ఎక్కడెక్కడో ఉంటూ సంక్రాంతి పండగకి పల్లెకు చేరుకున్న ప్రతి ఒక్కరికి రాష్ట్రం బాగుపడాలంటే మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు కలిగి ఉన్నారో లేదో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రొఫెషనల్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు గొర్లె కిషోర్, అరకు పార్లమెంట్ అధ్యక్షులు జె.వి రమణ, అరకు కార్యదర్శి కార్తీక్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు రామారావు, రాజేష్, ఆనంద్ పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగదీశ్వరి

ఆకట్టుకున్న రంగోలీలు

ప్రజాశక్తి-వేపాడ

సంక్రాంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన శనివారం నియోజకవర్గంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. వేపాడ మండలంలోని వల్లంపూడి సచివాలయం వద్ద టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన నిర్వహించిన ముగ్గుల పోటీలకు భారీగా మహిళలు హాజరయ్యారు. విజేతలకు ఆయన నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, ఎంపిటిసి గొంప తులసి, జనపరెడ్డి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

కొత్తవలస : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. బోగి మంటలు వేసుకుని కోలాటాలు ఆడారు. డూడూ బసవన్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పండుగ రోజుల్లోనూ ఇబ్బందులేనా?

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సంక్రాంతి పండగ మూడు రోజుల్లోనైనా కరెంటు కోత లేకుండా సరఫరా చేయాలని టిడిపి పార్వతీపురం నియోజకవర్గం ఇంచార్జ్ బోనెల విజయ్ చంద్ర విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం పట్టణ మెయిన్ రోడ్డులో కరెంట్ లేకపోవడంతో ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకు పట్టణ మెయిన్ రోడ్‌లో కరెంట్ లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారన్నారు. పండుగ రోజుల్లో కరెంటు కోత వల్ల వ్యాపారాలు సక్రమంగా జరగక ఆవేదనకు గురయ్యారన్నారు. పిండి మిల్లు వద్ద సంక్రాంతి పండుగకు అవసరమైన పిండి వంటలు కోసం పిండి ఆడించుకునేందుకు ప్రజలు పడిగాపులు కాశారన్నారు. ఇది ఇలా ఉండగా తాగునీటి సరఫరా పట్టణంలో ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కనీసం పండగ రోజుల్లోనైనా తాగునీటి సరఫరా చేయాలన్నారు. పార్వతీపురంలో వేసవి, వర్షాకాలం అన్న తేడా లేకుండా కరెంటు కోతలు విధించిన సందర్భాన్ని గుర్తు చేశారు. సుదూర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు పండగ చేసుకునేందుకు వచ్చిన ప్రజలు కరెంట్ లేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. కనీసం పండగ అయినా ప్రశాంతంగా చేసుకోవాలని కోరారు. కరెంట్ కోత పై విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అధికారులు ఫోనుకు స్పందించకపోవడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, వంగల దాలి నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయ్ చంద్ర

రెచ్చగొట్టే మెసేజ్‌లు పెడితే చర్యలు

ప్రజాశక్తి- సాలూరు

వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ జి.డి. బాబు హెచ్చరించారు. శనివారం ఆయన టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలను రెచ్చగొట్టే విధంగా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టరాదని కోరారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం పై దృష్టి సారించామని రాత్రివేళ్ళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, అమ్మాయిలను ర్యాగింగ్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. మీడియా సహకారంతో పట్టణంలో సారా విక్రయాలు, గంజాయి రవాణా పై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. పండుగ సందర్భంగా పేకాట శిబిరాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

జనసేన నాయకుడిపై కేసు

జనసేన నాయకుడినని చెప్పుకుంటున్న విజయ్ చౌదరిపై మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఫిర్యాదు చేశారు. తనను దుర్భాషలాడుతూ వీడియోని సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై భంజ్ దేవ్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, జనసేన నాయకుడినని చెప్పుకుంటున్న జిటి నాయుడుల ప్రోద్బలంతో విజయ్ చౌదరి అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. దీనిపై సిఐ జిడి బాబుని వివరణ కోరగా భంజ్ దేవ్ నుంచి ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేశామని చెప్పారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముందుకు కదలని పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం ప్రధాన రహదారి పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నప్పటికీ నేటికీ పనులు పూర్తి కాలేదంటే పూర్తి ప్రభుత్వ అసమర్థత పాలనకు అద్దం పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. రహదారి విస్తరణకు ఉత్సాహం చూపి షాపులు, ఇళ్లు కొట్టిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పుడు దుమ్మూ, ధూళితో ప్రజానీకం ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. అనుకున్న సమయంలో పనులు పూర్తి చేయని, గుత్తేదారులు మార్చి వేరొకరితోనైనా పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వీరఘట్టం ప్రధాన రహదారితోపాటు చిదిమి, ఎం.రాజపురం, కొట్టుగుమ్మడ, కంబర, చిట్టిపూడివలస తదితర గ్రామాల్లోని రహదారుల మరమ్మతులు చేయకపోవడంతో గర్భిణీలు, చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు ఆయన అన్నారు. నీలంపేట, డిపి వలస, యు.వెంకంపేట, గదబవలస తదితర గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో రహదారి పనులు ప్రారంభించినప్పటికీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి గాలిలోకి వదిలేసిందని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రసంగాలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు

పార్వతీపురంలో పోటీకి రెడీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాబోయే ఎన్నికలలో పార్వతీపురం శాసన సభ స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, గతంలో ఇచ్చిన హామీ మేరకు వైయస్ జగన్ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నానని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన 2024 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2012 నుండి ఉద్యోగం వదిలి వచ్చాక, పార్టీ బలోపేతం కోసం కృషి చేశానన్నారు. 2014 ఎన్నికలలో తక్కువ మెజార్టీతో వ్యతిరేక ఫలితాన్ని చూడాల్సి వచ్చిందన్నారు. 2019 ఎన్నికల సమయంలో తనకు వైసిపి అధినేత జగన్ స్పష్టమైన హామీ ఇచ్చారని, అనంతరం టిడ్కో చైర్మన్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను కూడా గత నాలుగేళ్లుగా సక్రమంగా నెరవేర్చేందుకు నిరంతరం కష్టపడి పనిచేసి దేశంలోనే టిడ్కోకు మంచిపేరు తీసుకు వచ్చానని తెలిపారు. ఇంతవరకు రాష్ట్రంలో 35 పట్టణాల్లో ఒక్కరూపాయికే 90 వేల టిడ్కో గృహాలను అందజేశామన్నారు. విజయనగరం జిల్లాలో 2116 టిడ్కో ఇళ్ళను, పార్వతీపురం జిల్లాలో 800 టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 19న విజయవాడలోని ప్రధాన కూడలిలో రూ.300 కోట్లతో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బారీ విగ్రహం ప్రారంభ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గాజాపు వెంకటనాయుడు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాలే తరువాయి : జమ్మాన

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని శనివారం గొట్టాపు కమలమ్మ కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోర్జ హేమ సుందర రావు నాయుడు మాట్లాడుతూ పాఠశాలకు జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని అందించిన కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిభా దేవీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి , పార్వతీపురం జిల్లారెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు మాస్టారు, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, ప్రముఖ సామాజిక విశ్లేషకులు కోడిగుడ్ల రవి, ముంబాయికి చెందిన హైకోర్టు న్యాయవాది గొట్టాపు ప్రవీణ్, రిలయన్స్ ఎండి గొట్టాపు ప్రశాంత్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు షేక్ గౌస్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహావిష్కరణ చేస్తున్న నిర్వాహకులు

అందని రేషన్

ప్రజాశక్తి-బాడంగి

ఎరుకులపాకలు గ్రామంలో ఈ నెల రేషన్ ఇప్పటికీ పంపిణీ చేయలేదు. రేషన్ పంపిణీ వాహనం కోసం ఆ గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పండగ సమీపించినా రేషన్ బియ్యం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతి సంక్రాంతికీ చంద్రన్న కానుక పేరుతో బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులు కూడా ఇచ్చేవారని, వైసిపి అధికారంలోకి వచ్చాక బియ్యం కూడా సరిగా పంపిణీ చేయడం లేదని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు తెలిపారు. అధికారులు స్పందించి ప్రతి నెలా మొదటి వారంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కోరారు.

ఆదర్శప్రాయుడు వైఎస్ : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆదర్శప్రాయుడు కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అన్నారు. మండలంలోని తెట్టంగిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్రంలో సుపరిపాలన అందించారని వారన్నారు. ప్రస్తుతం కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అలాగే ప్రజల శ్రేయస్సుకు కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు వారన్నారు. గ్రామంలో వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు అలజంగి విజయమ్మ, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, ఎంపిటిసిలు సతివాడ వరలక్ష్మి -చిన్నమనాయుడు, మాజీ ఉపసర్పంచి పొట్నూరు పరిశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పల్లెగూటికి పండగొచ్చింది

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

దూర ప్రాంతాల్లో ఉంటూ పండగ నేపథ్యంలో ఇంటికి చేరుకునే కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు మనవళ్లతో పల్లెల్లో పండగ వాతావరణ నెలకొంది. ఇంటికి సున్నాలు, రంగులు వేయడం, గదులను శుభ్రం చేయడం, మూలపడిన మంచాలను, ఇతర సామగ్రిని సిద్ధం చేయడం ఇలా.. నెల రోజుల ముందే పండగ ప్రారంభమైంది. ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటిలోనూ ఆకర్షణగా ఉండే ఇత్తడితో తయారుచేసే బిందెలు, అండాలు, తదితర సామగ్రిని తళతళలాడుతూ మెరిసేలా చేయడం పెద్దపనిగా భావిస్తారు. గత 15 రోజులుగా ఏ పల్లెలో చూసినా అదే సందడి. హడావుడి.. ఇక పండగలో ఇంకో ప్రత్యేకత పిండివంటలు. అరిసెలు, చక్కిరాలు, బూరెలు, గారెలు వంటి వంటలు కూడా ముందుస్తుగానే తయారీ చేసుకున్నారు. భోజనాలతో తినడానికి అప్పడాలది పెద్దపాత్ర. వీటిని తయారు చేయడం సమిష్టి పని, వీటి కోసం ఇరుగు పొరుగు వారి సహకారం తీసుకుని తమ స్నేహాన్ని చాటుకున్నారు. పగటిపూట ఇంటి పనులు ముగించుకుని సాయంత్రం సమీప పట్టణాల్లో కొత్త బట్టలు కొనుక్కోవడం ప్రారంభం కావడంతో పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం మార్కెట్లు పల్లెజనాలతో కళకళలాడుతున్నాయి. ఏదేమైనా రెండు రోజుల్లో రంగుల ముగ్గులు, గంగిరెద్దుల సన్నాయిలు, హరిదాసుల కీర్తనలు, అక్కడక్కడా కోడిపందేలతో ప్రారంభం కానున్న సంక్రాంతి కళ పల్లెల గూటికి చేరిపోయింది.

గ్రామంలో వెలిసిన చిల్లర దుకాణం... హరిదాసు రాక

నేరాలు ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-మెరక ముడిదాం

మండలంలోని యాడిక గ్రామానికి చెందిన చావు బాలమ్మ శనివారం పాము కాటుకు గురై మృతి చెందింది. బుదరాయ వలస పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాలమ్మ (33) తన పొలంలో వేసిన మొక్క జొన్న పంటను చూడటానికి వెళ్లింది. చేలో పాము కాటు వేయడంతో వెంటనే భర్త శ్రీనుకు తెలియజేసింది. హుటాహుటిన చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లగా మెరుగైన చికిత్స కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలమ్మ మృతి చెందింది.